# 4. ఇంద్రధనుస్సు

**నేపథ్యం:**

- VIBGYOR–అను సంక్షిప్త రూపాన్ని దేనిని జ్ఞాపకం ఉంచుకోవడానికి వాడతారు.
- కింది అక్షరాల విస్తార రూపాలు రాయండి

| V | I | B | G | Y | O | R |
|---|---|---|---|---|---|---|
| | | | | | | |



ఎంత చక్కని ధనుస్సు! ఏడు రంగుల ధనుస్సు!
ఎంత జూచిన మనసు తనివి తీరని ధనుస్సు!
మింటికి మంటికి ఒకటిగా నిలిచింది
అవని ఆకాశముల వంతెనై వెలసింది|| 1

అర్జునుని గర్జించు గాండీవమా కాదు
రాముండు విరిచిన శివధనుస్సా కాదు
ఇంత వింతగు ధనుస్సు ఈ జగతిలో లేదు
వింతపురుషుండెవరో మింట సంధించాడు|| 2

ఏ లోహ నిర్మితమే; ఏ వింత తంత్రమో
నారి జాడయో లేదు; బాణమా కనరాదు
ఏ రీతి వంగెనో ఎరుగజాలము విల్లు
ఆకాశమంతటను అలముకొన్నది సొంపు|| 3

విల్లు విరిసినచాలు వానల్లు కొనసాగు
విల్లు వెలసినచాలు జల్లువానలు ఆగు
వానరాకడ విల్లు, వానపోకడ విల్లు
విలువల్లు గల విల్లు సొగసులకు పుట్టిల్లు|| 4

ఇంద్రజాలంబనుచు, హరివిల్లిదే యనుచు
కట్టుకథలెన్నెన్నొ పుట్టు కొనివచ్చాయి
ఇంద్రజాలముకాదు; కాదోయి హరివిల్లు
సూరీడు కిరణాల ఘనగారడీ విల్లు॥ 5

అందాలు చిందించు అంబరపు సిగపువ్వు
ఆనంద మొలికించు గగనభామిని నవ్వు
ఏమైన కానిండు అది జగత్తుకు నిండు
మనసార తిలకించి మురిసెదము రారండు॥ 6

## I. వినండి-సంభాషించండి.

1. మీరెప్పుడైనా ఇంద్రధనుస్సును చూశారా?
2. ఇంద్రధనుస్సు ఎప్పుడు, ఎక్కడ కన్పించును?
3. ఇంద్రధనుస్సులో ఎన్ని రంగులుంటాయి?
4. ఇంద్రధనుస్సులోని రంగుల పేర్లు చెప్పండి.

## II. పదజాలం పెంపొందించుకుందాం – భావాలు నేర్చుకుందాం.

### అ. అర్థాలు :

ధనుస్సు = విల్లు, ధనువు; తనివి = తృప్తి; మిన్ను = ఆకాశము; మన్ను = భూమి, మట్టి; అవని = భూమి, నేల; గర్జించు = అరుచు, మేఘం ధ్వని చేయు; పెద్ద ధ్వనిచేయు; జగతి = ప్రపంచము; సంధించుట = ఎక్కుపెట్టుట; నారి = వింటి అల్లెత్రాడు; రీతి = పద్ధతి; అలముకొను = వ్యాపించు, ప్రసరించు, ఆక్రమించు; సొంపు = అందం; వన్నె; ఇంద్రజాలము = కనికట్టు; హరివిల్లు = విష్ణుచాపము (పరశురాముని); అంబరము = ఆకాశము;

### ఆ. భావాలు :-

1. ఇంద్రధనుస్సు ఏడు రంగులతో కూడిన చక్కని ధనుస్సు. భూమిని, ఆకాశమును కలుపుతూ వంతెనవలె నిలిచినట్టి ఈ ధనువును ఎంత చూచినా తనివి తీరదు.
2. ఈ గర్జించునట్టి ధనుస్సు అర్జునుని గాండీవముకాదు. రామచంద్రుడు విరిచిన శివధనువు కూడా కాదు. ఇటువంటి వింతయైన ధనువు ఈ జగత్తులోనే లేదు. వింత పురుషుడెవరో ఆకాశంలో ధనువు ఎక్కుపెట్టినట్లు కనిపించును.
3. ఇంద్రధనుస్సు ఏలోహముతోనూ నిర్మించబడినదికాదు. ఏ వింత తంత్రశక్తులతో ఏర్పడినది కాదు. అల్లెత్రాడు అన్నది లేదు. ధనువు నెక్కుపెట్టు బాణము కనిపించదు. ఆకాశమంతా వ్యాపించి అందాన్ని గొలుపు ఆ విల్లు ఎట్లు వంగియున్నదో తెలియరాదు.
4. వానజల్లు కురియునపుడు ఇంద్రధనుస్సు వెలయును. వాన ఆగిపోగా ధనుస్సు తొలగిపోవును. వాన వచ్చునపుడు, పోవునపుడు వెలయు ఈ ధనుస్సు అందాలకు పుట్టినిల్లు.
5. ఆకాశంలో ఏర్పడే ఇంద్రధనుస్సు కనికట్టు (ఇంద్రజాలం) అని, హరివిల్లు అని కథలెన్నోవున్నాయి కాని ఇది కనికట్టుకాదు, హరివిల్లు కాదు. సూర్యకిరణాల గారడీవల్లే ఏర్పడినదీ (విల్లు) ఇంద్రధనుస్సు.
6. ఆకాశమునందలి ఇంద్రధనుస్సు అందాలనుచిందించు సిగపువ్వు వంటిది. ఆనందాన్ని ఒలికించు గగనభామిని నవ్వువంటిది. ఏమైనా కానివ్వండి. అది ప్రపంచానికి నిండుదనాన్నిస్తుంది. మనసారా చూచి సంతోషించెదము రారండి.

## III. కృత్యం:

**కింది పద్యాలను చదివి సూచనానుసారం కృత్యాలను చేయండి.**

### అ. కింది పద్యపాదాలను సరైన క్రమంలో రాయండి.

నారి జాడయెలేదు, బాణమూ కనరాదు
ఆకాశమంతటను అలముకొన్నది సొంపు
ఏలోహనిర్మితమొ, ఏవింత తంత్రమో
ఏరీతి వంగెనో ఎరగజాలము విల్లు




పుట సంఖ్య 12లోని 1, 2, 3 పద్యాలు

**ఆ. కింది పదములకు సమానార్థకములను రాయండి.**

1. తనివి = ______ 2. మిన్ను = ______

**ఇ. స్వీయస్పందన.**

ఆకాశములోని ఇంద్రధనుస్సును గురించి మీ సొంతమాటల్లో వర్ణించి రాయండి.

## IV. వినండి–చర్చించండి–రాయండి.

**అ. జవాబులు రాయండి.**

1. అర్జునుని ధనుస్సు పేరు
2. వానలెపుడు కొనసాగును.
3. ఇంద్రధనుస్సుపై పుట్టుకొచ్చిన కథలు.
4. ఇంద్రధనుస్సు అందరికి ఆనందాన్ని కలిగించు విధము.

**ఆ. కింది ఖాళీలను సరైన పదములతో పూరించండి.**

1. అర్జునుని గర్జించు ____________ కాదు
2. నారి జాడయె లేదు, ____________ కనరాదు.
3. వాన రాకడ విల్లు, ____________ విల్లు.
4. సూరీడు కిరణాల ____________ విల్లు.

## V. భాషావగాహన

**అ. వాచకాలు గుర్తించండి.**

1. ధనుస్సు = ______ 2. అర్జునుడు = ______ 3. లోహము = ______ 4. పురుషుడు = ______

**ఆ. కింది పదాలను సొంత వాక్యాలలో ఉపయోగించి రాయండి.**

1. గర్జించు 2. అలముకొను

**ఇ. కింద గుర్తింపబడిన ప్రత్యయములు ఏ విభక్తులకు చెందినవో రాయండి.**

1. ఇంత వింతగు ధనుస్సు ఈ జగతిలో లేదు ______

అ) షష్ఠీవిభక్తి ఆ) తృతీయావిభక్తి ఇ) చతుర్థీవిభక్తి

2. ఆకాశమంతటను అలముకొన్నది సొంపు ______

అ) ప్రథమా విభక్తి ఆ) ద్వితీయా విభక్తి ఇ) పంచమీ విభక్తి

**ఈ. కింది పదాలను కలిపి రాయండి.**

1. వంతెన + ఐ = 2. కథలు + ఎన్నొ = 3.వింత + అగు = 4) ఆనందము + ఒలికించు =

## VI. సృజనాత్మకత:

ఇంద్రధనుస్సు ఏర్పడిన తర్వాత ఆకాశమెట్లుండునో రాయండి.

## VII. లేఖననైపుణ్యాలు – అంశాల ఆధారంగా కథ

**కింది అంశాల ఆధారంగా కథను రాసి, నీతిని తెల్పండి.**

నక్క, కొంగ స్నేహం ____________ నక్క ఇంట్లో విందు ____________ పళ్ళెంలో పాయసం ____________ కొంగ తినలేకపోవుట ____________ కొంగ ఇంట్లో విందు ____________ కూజాలో పులుసు ____________ నక్క తినలేక పోవుట ____________ నీతి ____________

**నేనివి తెలుసుకున్నా:**

- ఇంద్రధనుస్సు నందలి రంగులు
- ఇంద్రధనుస్సు ఏర్పడు విధము.

ఉపా.: ఇంద్రధనుస్సులోని రంగులను గూర్చి విద్యార్థులచే చర్చింపచేయండి.

విపా.: ఇంద్రధనుస్సు నందలి వివిధ రకాల చిత్రాలను అంతర్జాలం నుండి సేకరించండి.

I8U5DS